ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023

14న మోడల్ లాసెట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ నెల 14న మోడల్ లాసెట్‌ను నిర్వహించనున్నట్లు ఎపిబిసి అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగురు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5 సంవత్సరాల కోర్సులకు ఈ మోడల్ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని కొన్నావీధిలోని ఎంపిఆర్ లాకాలేజీలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు మోడల్ పరీక్ష ఉంటుందని, దీనికోసం అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. వివరాలకు 96407 80728 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బూర్జ మండలం అల్లిని నుంచి బూర్జలోకి ప్రవేశించిన వరదనీరు (ఫైల్)



కర'కట్టు' కథలేనా?

కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం అదిగో ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తోంది. కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం ఉన్న పళంగా వాటిని రద్దు చేసింది. అత్యంత ప్రమాదరకరమైన ప్రాంతాల్లో వరద గట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించిన అధికారులు.. 2021 ఆగస్టులో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు వాటికి ఆమోదం తెలపలేదు. వేసవి నేపథ్యంలో పనులు చేపట్టేందుకు అనువుగా ఉండటంతో అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఈ ఏడాదైనా ఆమోదం తెలిపితే వరద ముప్పు నుంచి కొన్ని గ్రామాలనైనా రక్షించుకునే వీలుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

- 2019లో ఉన్న పళంగా వరదగట్టు పనులు రద్దు
- వాటి స్థానంలోప్రమాదకర ప్రాంతాల్లో నిర్మించాలని నిర్ణయం
- ఏడాదిన్నర గడిచినా అనుమతివ్వని ప్రభుత్వం
- వంశధార, నాగావళి కరకట్టల పనులపై ఉదాసీనం

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి అధిగమించడానికి గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తా కూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 25 శాతం లోపు ఖర్చయిన పనులను నిలిపేసి వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. దీంతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గంగ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లిని నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో 2020 ఆగస్టులో ఒకసారి, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ, ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి కూడా అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రీ ప్రాజెక్ట్సు సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు.

వరద ముప్పు తప్పేనా?

వంశధారలో 40 వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తే చాలు.. తీర గ్రామాల్లో వణుకు మొదలవుతుంది. మొదటి ప్రమాద హెచ్చరికకే కొన్ని గ్రామాల్లోకి నీరు చొచ్చుకుపోతుంది. నాగావళిలోనూ 50 వేలు క్యూసెక్కుల వరద నీరొస్తే కొన్ని గ్రామాలను ఖాళీ చేయాల్సిందే. వంశధార నది పొంగితే కొత్తూరు మండలం నివగాం, మాతల, పొన్నుటూరు, హిరమండలంలోని కొన్ని ప్రాంతాలు తరచూ వరద ముంపునకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. నాగవళి నదికి వరద పోటెత్తితే బూర్జ మండలం అల్లిని, ఏటొడ్డుపర్త, పెద్దపేట, నీలదేవీపురం, ఆమదాలవలస మండలం కలివరం తదితర ప్రాంతాల్లోకి వరద నీరు ముంచెత్తుతోంది. పాత కరకట్టల పనులను ఓ వైపు ఆపేసిన ప్రభుత్వం, కొత్త పనులనూ చేపట్టకపోవడంతో వర్షాకాలంలో మళ్లీ వరద ముప్పు తప్పదేమో అన్న ఆందోళన నదీ పరివాహక ప్రాంతాల ప్రజల్లో నెలకొంది.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో భూ పరిపాలన కమిషనర్ సిద్ధార్థ జైన్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి నవీన్, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 20 నాటికి స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలని భూ పరిపాలన కమిషనర్ సిద్ధార్థ జైన్.. జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రెండో విడత రీసర్వే స్టోన్ ప్లాంటేషన్ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థజైన్ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన భూహక్కు పత్రాలు సిద్ధం చేయాలన్నారు. భూముల మ్యాపులను ప్రచురణ కోసం సర్వే శాఖకు పంపించాలని సూచించారు. భూ హక్కు పత్రాలను భూ యజమానులకు పంపిణీ చేసి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే, భూ రికార్డులు సహాయ సంచాలకులు కె.ప్రభాకర్ రావు, డిఆర్ఒ ఎం.రాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గడప వద్దకే పాలన

స్పీకర్ తమ్మినేని సీతారాం



సచివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-పొందూరు

సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకూ పాలన చేరువైందని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. పొందూరు మండలం దల్లవలస గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ. 6 లక్షలతో ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ప్రజా సంకల్ప యాత్రతో ఒంటి చేత్తో పార్టీని గెలిపించిన జగన్మోహన్ రెడ్డి.. ఆ విజయంలో కోట్లాది మంది ప్రజలను కూడా భాగస్వాములను చేశారన్నారు. రాజకీయ దుష్టశక్తులన్నీ ఏకమై ఎన్ని కుయుక్తులు పన్నినా ఎదురునిలబడి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలకు కట్టుబడి నాలుగేళ్ల పాలనలో 98 శాతానికిపైగా హామీల అమలు చేశారని, మేనిఫెస్టోలో లేని మరెన్నో కొత్త పథకాలకు సిఎం జగన్ శ్రీకారం చుట్టారని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఎఎంసి అధ్యక్షులు బాడాన సునీల్, జెసిఎస్ మండల కోఆర్డినేటర్ బాడాన కృష్ణ, సర్పంచులు రేగిడి లక్ష్మి, కిల్లా జ్యోతి, ఎంపిటిసి కిల్లాన సూర్యారావు, వైసిపి మహిళా విభాగం మండల అధ్యక్షులు తమ్మినేని కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నా కళ్లు తెరవరా?

- బిల్లులు రాక సర్పంచులు అప్పల్లో కూరుకుపోతున్నారు
- పంచాయతీల బకాయిలను వెంటనే చెల్లించాలి
- ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్


ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

పంచాయతీల్లో పనుల కోసం అప్పులు చేసి వడ్డీలు చెల్లించలేక సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని స్థానిక హోటల్‌లో నిర్వహించిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సదస్సు, అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లా రామచంద్రాపురం మండల కేంద్రం సర్పంచ్ ధనలక్ష్మి.. పంచాయతీలో రూ.20 లక్షలతో చేపట్టిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు బాధ తాళ్లలేక ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. పంచాయతీలో చేసిన పనులకు డబ్బులు రాని సర్పంచులందరిదీ అదే పరిస్థితిగా ఉందన్నారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోతే సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని తాము ముందే చెప్పామని గుర్తు చేశారు. డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు వైసిపి సానుభూతిపరులుగా ఉన్న సర్పంచులూ చెప్తున్నారని తెలిపారు. సర్పంచులు అప్పులు పాలై వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నా సిఎం జగన్మోహన్ రెడ్డి శాంతించడం లేదన్నారు. గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను పంచాయతీల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. సర్పంచులు, ఎంపిటిసిలకు గౌరవ వేతనంగా నెలకు రూ.15 వేలు, జెడ్‌పిటిసి, ఎంపిపిలకు రూ.30 వేలు చెల్లించాలని కోరారు.

ఎపి సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మి ముత్యాలరావు మాట్లాడుతూ సర్పంచులుగా ఎన్నికై రెండేళ్లు పూర్తయినా ప్రభుత్వం నిధులు, విధులు ఇవ్వకుండా వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచులు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయన్నారు. పంచాయతీల నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత పథకాలకు మళ్లిస్తోందని విమర్శించారు. పంచాయతీల కరెంట్ బిల్లులకు ఆర్థిక సంఘం నిధులు వెచ్చించడమేమిటని, ప్రభుత్వమే ఆ భారం భరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల పారంభోత్సవాలు, శంకుస్థాపనలు తదితర కార్యక్రమాల్లో గ్రామ ప్రథమ పౌరులుగా ఉన్న సర్పంచులకు కచ్చితమైన ప్రోటోకాల్ పాటించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ప్రతాపరెడ్డి, ఉపాధ్యక్షులు ఆనెపు రామక్రిష్ణ, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీడికి మద్దతుధర కల్పించాలి


మాజీ మంత్రి గౌతు శివాజీ
టిడిపి ఆధ్వర్యాన ధర్నా



ధర్నాలో పాల్గొన్న మాజీమంత్రి శివాజీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-వజ్రపుకొత్తూరు

జీడి పిక్కలకు మద్దతుధర ప్రకటించి, గరిష్ఠంగా 80 కిలోల బస్తాను రూ.16 వేలకు కొనుగోలు చేయాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వజ్రపుకొత్తూరు మండలం పూండిలో జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రధాన పంటగా జీడి ఉన్నందునే పరిశ్రమలు వెలిశాయని, పప్పుకు ఉండే ధర పిక్కకు లేకపోవడం బాధాకరమని అన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి జీడి రైతులు పిక్కలు ఏరుతున్నారని తెలిపారు. చివరికి జీడిపిక్కలకు సరైన ధర లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా వైసిపి హయాంలో జీడి రైతులు దగాపడ్డారని ధ్వజమెత్తారు. బస్తా జీడి పిక్కలు టిడిపి హయాంలో రూ.14 వేలు ఉంటే, వైసిపి గద్దెనెక్కాక బస్తా రూ.8 వేలకు కొంటున్నారని విరుచుకుపడ్డారు. మంత్రి జీడి రైతులకు మాయమాటలు చెప్పి బస్తాకు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం ద్వారా ఇస్తామన్న హామీ నీటిమీద రాతలుగానే మిగిలిపోయిందని విమర్శించారు. నేటికీ రైతులకు అదనంగా ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి ప్రయోజనం అందలేదని దుయ్యబట్టారు. జీడి పిక్కల నిల్వకు సరైన కేంద్రాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బికెల ద్వారా జీడిపిక్కలను కొనుగోలు చేయాలని, జీడి పంటకు ఇన్సూరెన్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీడి రైతులకు న్యాయం జరగకపోతే మరోసారి వారి తరపున దీక్షకు దిగుతానని హెచ్చరించారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, తమ హయాంలో జీడి రైతులకు న్యాయం జరిగేలా మధ్యవర్తిత్వం వహిస్తానని హామీనిచ్చారు. స్థానిక జీడి వ్యాపారులు వ్యాపార దృష్ట్యా కాకుండా మన ప్రాంత రైతుల శ్రేయస్సు సామాజిక దృక్పథంతో సరైన ధరలు చెల్లించి పిక్కలను కొనాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి విఠల్, మాజీ ఎంపిపి వసంత స్వామి, టిడిపి మండల అధ్యక్షులు మోహనరావు, శశిభూషణ్, దాసరి తాతారావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.



చర్చల్లో పాల్గొన్న వ్యాపార, కార్మిక సంఘాల నాయకులు

జీడి వ్యాపారులు, కార్మికుల చర్చలు విఫలం

ప్రజాశక్తి-పలాస

జీడి వ్యాపారులు, కార్మికుల మధ్య జరిగిన వేతన ఒప్పంద చర్చలు మరోమారు విఫలమయ్యాయి. వేతన సవరణ చేయాలని నిర్ణయించుకున్నా ఏకాభిప్రాయానికి రాకపోవడంతో వాయిదా పడ్డాయి. ప్రతి రెండేళ్లకోసారి వేతన సవరణ చేయాల్సి ఉంది. అందులో భాగంగా జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో మూడో దఫా గురువారం వ్యాపార, కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వ్యాపార సంఘం అధ్యక్షులు మల్లా సురేష్ కుమార్, కార్యదర్శి కెవి శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, జీడి వ్యాపార సంఘం నాయకులు మల్లా భాస్కరరావు, శాసనపురి మురళీకృష్ణ, బి.నారాయణరావు, కార్మిక సంఘం అధ్యక్షులు భీమారావు, కార్యదర్శి బొమ్మాళి తాతయ్య, గౌరవ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షులు బొంపల్లి విశ్వనాథం.. గురువారం చర్చలకు హాజరయ్యారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై 60 శాతం అదనంగా ఇవ్వాలని సూచించారు. వ్యాపార సంఘం నాయకులు మల్లా సురేష్‌కుమార్ మాట్లాడుతూ సరైన మార్కెట్ లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, మరో మూడేళ్ల ధరలు పెంచబోమని చెప్పడంతో ఇరువురి మధ్య వాదనలు పెరిగాయి. దీంతో వ్యాపారులు ఐదు శాతం పెంచడానికి అంగీకరించారు. కనీసం 30 శాతం వేతనాలు పెంచాలని కార్మిక సంఘం నాయకులు పట్టుబట్టారు. మరోసారి సమావేశమవుదామని వ్యాపారులు చెప్పడంతో చర్చలు వాయిదా పడ్డాయి. సమావేశంలో వ్యాపారులు కొత్తకోట తిరుమలరావు, డోకి నాగేశ్వరరావు, సిందిరి సతీష్, కార్మికసంఘ నాయకులు ఆదినారాయణ, కె.రాము పాల్గొన్నారు.

దళితులకు ఏం చేశారో చెప్పాలి

టిడిపిపై తిరగబడే రోజు వస్తుంది : సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్



మాట్లాడుతున్న సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రానికి 14 ఏళ్లు సిఎంగా చేసిన చంద్రబాబు దళితులకు ఏం చేశారో చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ నిలదీశారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, దుష్టచతుష్టయానికి తప్ప ఎస్‌సిలకు ఎటువంటి మేలూ జరగలేదన్నారు. దళితులుగా పుట్టడానికి ఎవరు ఇష్టపడతారని గతంలో చంద్రబాబు అన్నారని, ఇప్పుడు ఆయన తనయుడు లోకేష్ కూడా ఎస్‌సిలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా 1.40 కోట్ల మందికి లబ్ధి చేకూర్చిందని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు ఇస్తుంటే పప్పు బెల్లాల మాదిరిగా పంచేస్తున్నారంటూ చంద్రబాబు విమర్శిస్తున్నారని చెప్పారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందంటూ గోబెల్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దళితులకు ఏ మేలూ చేయని టిడిపిపై వారే తిరగబడతారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే 175 సీట్లూ గెలుస్తామని చెప్తున్నామన్నారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించామంటూ ప్రచారం చేస్తున్నారని, ఏ పథకానికి ప్రభుత్వం మళ్లించిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇసుక అమ్మేసుకున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారని, గతంలో టిడిపి నాయకులు అమ్ముకోలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పొన్నాడ రుషి, సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు కె.రాంగోపాల్, విశాఖ కార్పొరేటర్ వెంకటరమణ, శ్రీకూర్మం సర్పంచ్ అనిత, ఎస్‌సి సెల్ రీజనల్ కోఆర్డినేటర్ కంబాల సందీప్, ఎస్‌సి సెల్ మహిళా విభాగం నాయకులు జయప్రద తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాం

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ



నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - కవిటి

రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. కవిటి తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలోని జగనన్న కాలనీలో నిర్మించిన నూతన గృహాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకోవాలనే తపనతో గ్రామానికి చెందిన మొగిలిపురి చంద్రకళ శరవేగంగా తన ఇంటిని నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాశ్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ సభ్యులు పాండవ శేఖర్, మొగిలిపురి సీతారాం, పి.జయరాం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా కోరారు. గురువారం జిల్లా బార్ అసోసియేషన్ల న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. నగరంలోని పిఎస్ఎన్ స్కూల్ వెనుక ఉన్న మున్సిపల్ మైదానంలో ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సలహా కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసి, సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉండేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ పడడానికి న్యాయవాదులంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, ఫణికుమార్, అనురాధ, శారదాంబ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసి నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

సచివాలయాలతో సంక్షేమ పాలన

ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని లోపెంట పంచాయతీలో రూ 25 లక్షలు ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రూ.కోటి నిధులతో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంట్రల్ భవనాలను నిర్మించామని అన్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు గ్రామాలాభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక్వాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, పిఆర్ డిఇ సీతంనాయుడు, ఎంపిడిఒ సురేష్ కుమార్, తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి, మీసాల శ్రీనివాసరావు, గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక శాఖాగ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా నాలుగో రోజు గురువారం గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులకు ముందుగా దినపత్రికలు చదవడం, కథలు చదివించడం రాయించడం చేశారు. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి కార్యదర్శి జిల్లా గ్రంథాల సంస్థ విబిజిఎస్ శంకరరావు రణస్థలం శాఖాగ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా ఆంగ్ల ఉపాధ్యాయులు కె.భాస్కరరావు (పార్ట్స్ ఆఫ్ స్పీచ్ అండ్ స్టోరీ



బలగ : డ్రాయింగ్ పెయింట్స్ వేస్తున్న విద్యార్థులు

టెల్లింగ్ గురించి వివరించారు). విశ్రాంతి ఉద్యోగి ఆర్.ధర్మారావు నీతి కథలు (అత్యాశకు పోకూడదు), మహాభారతంలో కావ్యాలు, ఉపాధ్యాయుల వృత్తుల గురించి వివరించారు. అలాగే విద్యార్థినీ, విద్యార్థులకు జూనియర్ కాలేజ్ ఇంగ్లీష్ అధ్యాపకులు కె.శ్రీనివాసరావు జనరల్ నాలెడ్జ్‌తో పాటుగా మిమిక్రీ చేసి విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో కూడిన విద్యను అందించారు.

శ్రీకాకుళం : జిల్లా గ్రంథాలయంలో ఉపాధ్యాయులు టి.ఎర్రమ్మ, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.ఈశ్వరరావు, రెడ్డి లలిత పిల్లలకు డాన్స్‌లు, సంగీతం, తెలుగు నీతి వాక్యాలు చెప్పారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి పి.భానుమతి, పి.ఈశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

బలగ : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యాన బలగ శాఖాగ్రంథాలయంలో విద్యార్థులతో డ్రాయింగ్ పెయింటింగ్ చేయించారు. ఇందులో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆబోతుల రామ్మోహన్, సహాయకులు కె.అనిత, 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నారులు పాల్గొని సందడి చేస్తున్నారు. గ్రంథాలాయినికి వచ్చే విద్యార్థులను బృందాలుగా విభజించి ఖోఖో క్రీడను ఆడించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, వ్యాకరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి.జయకుమార్, గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.ఉదయ్‌కిరణ్, అమ్మనమ్మ పాల్గొన్నారు.

లావేరు : ప్రాథమిక స్థాయి నుంచే శతకాలు నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులతో వేమన శతకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఈ శతకాలు చదవాలని సూచించారు. అలాగే ఆరోగ్యం మహాభాగ్యంపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చదివించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ



టెక్కలి : ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



లావేరు : కథ చదువుతున్న విద్యార్థి

సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

పలాస : వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటలతో పాటు ప్రత్యేక శిక్షణ తరగతులపై దృష్టి పెట్టాలని విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు సూచించారు. కాశీబుగ్గ శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గ, హేమంత్, గ్రంథాలయాధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

45 మంది రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మండలంలని చాపర శ్రీసాయి డెంటల్ కళాశాలలో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 45 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ టి.వి.గంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణప్రసాద మాట్లాడుతూ తలసిమియా వ్యాధితో బాధపడుతూ ఉన్న చిన్నారులకు రక్తమందించి సహాయ పడాలని సంకల్పంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని అన్నారు. కాబోతున్న డాక్టర్ కమ్ విద్యార్థులూ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు కళాశాల యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించారు. రక్తం కొరత ఉన్న సమయంలో రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. అలాగే డెంటల్ కళాశాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన పేద, మధ్యతరగతి ప్రజలకు దంత సంరక్షణపై చైతన్యం కలిగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధీర్, డాక్టర్లు ఎల్.శ్రీకాంత్, కె.నందితారాణి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ప్రకాష్, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎంఇఒ డి.తులసీరావు అన్నారు. మండలంలోని పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మల్లారెడ్డి పద్మనాభ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 500 పైచిలుకు మార్కులు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతర సాధన ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. పాఠశాల ఈ ఏడాది 94 శాతంతో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో



విద్యార్థులతో ఎంఇఒ తులసీరావు

ఎంపిటిసి బాలక శ్రీను, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలక సునీల్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు కె.ధర్మారావు ఆర్.కైలాసరావు, పి.చందరరావు, టి.గోపాలకృష్ణ, ఎన్.రమేష్, ఎస్.రాము, జి.శ్రీనివాసరావు, రూపమ్మ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న శ్రీకాంత్

విద్యార్థినికి అభినందనలు

మెళియాపుట్టి: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని సానిపాలెంకు చెందిన ఉర్లాన జాహ్నవి 590 మార్కులు సాధించింది. ఈమె సారవకోట కెజిబివిలో చదువుకుంది. విషయం తెలుసుకున్న తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ గురువారం ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. చదువులో మరింత రాణించి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి సర్పంచ్‌లు జనపరెడ్డి కన్నబాబు, గణేష్ ప్రధాన్, ఎస్.గౌరేష్, పి.చందరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రంగారావు, బోసి రామారావు, రేఖాన వాసు, ఎంపిటిసి ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

కలప అక్రమంగా తరలిస్తే చర్యలు

బూర్జ : బూర్జ సమీపంలో గజిల్‌గెడ్డ కాలువపై ఉన్న చెట్లను అక్రమార్కులు నరికివేస్తే చర్యలు తీసుకుంటామని నీటిపారుదలశాఖ ఎఇఇ శివశంకర్ హెచ్చరించారు. 10,11 తేదీల్లో 'ప్రజాశక్తి'లో గజిల్‌గెడ్డ కాలువపై ఉన్న చెట్లు అక్రమార్కులు నరికివేతపై కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై శివశంకర్ స్పందించి గురువారం పరిశీలించారు. చెట్ల మొదళ్లు తదితర వాటిని పరిశీలించి చెట్ల నరికివేత నిజమేనని ధ్రువీకరించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రమణారావుకు సూచించారు. ఈ చెట్లు నరికివేతపై దర్యాప్తు చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రకృతి సాగు వివరాల నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న రైతుల వివరాలను నమోదు చేస్తున్నట్లు మండల యాంకర్ నక్క చిరంజీవిరావు తెలిపారు. మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో ఎంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు? ఎంత విస్తీర్ణంలో సాగుచేస్తున్నారో తెలుసుకొని ఉరివి యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నామని చెప్పారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు ప్రకృతి వ్యవసాయంపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, మల్లేష్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాచ మార్గం



జడ్జి శ్రీభరణి

కోటబొమ్మాళి: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, మండల న్యాయ సేవా సంఘం ఇన్‌ఛార్జి అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి అన్నారు. స్థానిక కోర్టులో ఫీ లోక్ ఆదాలత్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 13న కోటబొమ్మాళి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, భార్యాభర్తల కేసులు, చిట్ ఫండ్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని అన్నారు. అందువల్ల న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డి.నరసింహామూర్తి, కార్యదర్శి అప్పలనాయుడు, ఎపిపి ప్రియదర్శిని, న్యాయవాదులు కె.మన్మథరావు, బి.ధర్మారావు, ఎల్.శ్రీనివాసులు, పూజారి వాసుదేవరావు, పల్లి రామారావు, కె.వెంకటరావు, ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ పాల్గొన్నారు.

'గడపగడపకు'తోనే సమస్యలు పరిష్కారం

కోటబొమ్మాళి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సంకేతిక లోపంతో అందకపోతే చెప్పాలని, తద్వారా సంక్షేమ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హామీనిచ్చారు. మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు, దుర్గంపేట గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే దుర్గంపేటలో పని చేయని తాగునీటి బోరును పరిశీలించి అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అంతకుముందు చీపుర్లపాడు సచివాలయ సిబ్బందిని సన్మానంచారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పగడాలమ్మ

ప్రజాశక్తి- నందిగాం

నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ సూచించారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతపై ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావుని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు చేపట్టి పనులతో పాటు సరఫరా అయిన మెటీరియల్స్‌ను పరిశీలించారు. అనంతరం పది ఫలితాల్లో పిరియా శ్రీహర్ష 549 మార్కులు సాధించడంపై అభినందించారు. ఈమెతో పాటు ఎంఇఒ నాగభూషణరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశి, ఎడ్యుకేషనల్ ఆసిస్టెంట్ తిరుపతిరావు, పాఠశాల కమిటీ చైర్మన్ పిరియా ధర్మారావు పాల్గొన్నారు.

కూటి కోసం సర్కస్ ఫీ(పా)ట్లు

ప్రజాశక్తి- టెక్కలి

జానెడు పొట్ట నింపుకోవడానికి, జీవితాన్ని గడుపుకోవడానికి ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. మనిషి జీవన వైవిధ్యాలు, విధానాలు మారుతున్నా ఆకలి తీర్చుకోవడానికి పడే పాట్లులో మాత్రం మార్పు రాలేదనే చెప్పాలి. తరతరాల నుంచి వస్తున్న వృత్తినే నమ్ముకుంటూ సాహసాన్నే ఊపిరిగా చేసుకుని పొట్టనింపుకోవడానికి సర్కస్ వాళ్ల చేసే విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. ఒకప్పటి వేసవి వినోద సర్కస్ మారిన కాలం ప్రకారం అంతరించుకుపోయిందని భావిస్తున్న క్రమంలో టెక్కలిలో సర్కస్ చేసే రెండు కుటుంబాలు గ్రామాల్లో ప్రజలను, పట్టణ ప్రజలను కొంతసేపు విస్మయానికి గురిచేస్తూ... ఆనందాన్ని నింపుతున్నారు. వరంగల్ జిల్లా జనగామకు చెందిన రెండు కుటుంబాలు టెక్కలి వచ్చి సర్కస్ పీట్లు చేస్తూ... కనువిందు చేస్తున్నారు. సాయమత్రానికి గ్రామాలకు చేరుకుని రాత్రి సమయంలో వీరు చేసే పీట్లుని గ్రామస్తులు చూస్తూ... ఎప్పుడో చిన్నతనం నాడు చూసిన జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. మైబైల్స్‌కు పరిమితమైన యువత ఈ పీట్లని చూసి ఆశ్వర్యానికి గురవుతున్నారు.



యువతి గుండెపై రాయిని బద్దలు కొడుతున్న సర్కస్ యజమాని

గ్రామాల్లో సర్కస్ పీట్లు చూపించి జీవనానికి డబ్బులు సంపాదించుకుంటున్నారు. జనగామ ప్రాంతానికి చెందిన తాము రెండు కుటుంబాల నుంచి 13 మంది వచ్చామని, గ్రామాల్లో సర్కస్ చేస్తూ... వలసలుగా పర్యటిస్తామని తెలిపారు. గ్రామాల్లో చిన్నపాటి శిబిరం వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రామాల్లో సర్కస్ పీట్లు పలువురుని ఆకర్షిస్తున్నాయి.

నాణ్యమైన విద్యే అభివృద్ధికి మూలం

వజ్రపుకొత్తూరు: నాణ్యమైన విద్య అభివృద్ధికి మూలమని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురం వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గోరకల విశ్వనాథ్ ఆధ్వర్యాన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాటాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన నాడు-నేడు పథకం కింద పాఠశాలల ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రత్యేక చొరవ తీసుకొని అదనపు పాఠశాల గదులతో పాటు పది కాంపోనెంట్స్‌కు రూ.79 లక్షలు మంజూరు చేయడం



శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

హర్షణీయమని అన్నారు. సామాజిక అంతరాలు ఆర్థిక స్థితిగతులను మార్చడానికి విద్య దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి గోరకల విశ్వనాథం, ఎంఇఒ డి.తులసీరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తిని భాస్కర రావు, గోరకల రామారావు కె.నారాయణరావు, ఎస్.ధర్మారావు, ఎస్.వైకుంఠరావు, పి.వెంకటేష్, కె.వెంకి, దేవరాజు, అప్పలస్వామి పాల్గొన్నారు.

'ఉపాధి' ద్వారా కాలువల అభివృద్ధి

ప్రజాశక్తి- కంచిలి

మండల రైతులకు మేలు చేసే విధంగా ఉపాధి హామీ పనులను అనుసంధానం చేస్తున్నామని ఎంపిపి దేవదాసు రెడ్డి అన్నారు. మహేంద్ర తనయ నది నుంచి పైడిగాం ఛానల్ ద్వారా సాగునీరు అందించే మండలంలోని శాసనం, గోకర్ణపురం, జలంతర కోట, బూరగం పంచాయతీల్లో కాలువల అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు రైతులకు ప్రయోజనం కల్పించేందుకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజు ఎంతో కృషి చేశారన్నారు. ఉపాధి కూలీలు వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి కాలువల పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సాగు కాలువను పరిశీలిస్తున్న ఎంపిపి దేవదాస్ రెడ్డి

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం



నగదు అందిస్తున్న ప్రసాదరావు


ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులకు మనం అందించేది చిరు కానుకైనా, ఆ ప్రోత్సాహం వారికి వేయి ఏనుగుల బలాన్ని అందిస్తుందని విశ్రాంత డిఎస్‌పి శమల్ల ప్రసాదరావు అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రసాదరావు గురువారం నగదు, బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహం చాలా అవసరమని, అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నొలియా భవాణీకి రూ.5 వేలు, పొల్లాయి దీపికా సుప్రియకు రూ.2.500, గుర్రాల చంద్రశేఖర్‌కు రూ.2.500 అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, పూడి వెంకటేశ్వరరావు, బావన నూకరాజు, బార్ల రాజేష్, పొల్లాయి కేశవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జునుడు, జయరాం, డి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

40 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కవిటి

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సోంపేట ఆరోగ్యవరం సహకారంతో మండలంలోని దుగాణపుట్టుగలో గురువారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఐదుగురికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. పది మందికి ఉచితంగా



నేత్రాను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.భద్రాచలం, వైద్య సహాయకులు ఆర్.శివ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోలీస్ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్

కోటబొమ్మాళి: ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైల్ వెల్ఫేర్ అసోసియేషన్ పోలీస్ గ్రీవెన్‌సెల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా కస్తూరిపాడుకు చెందిన బమ్మిడి శ్రీనివాసరావును రాష్ట్ర చైర్మన్ రాజేష్ సిల్వ గురువారం నియమించారు. ఈ పదవిని తనపై బాధ్యతతో అప్పజెప్పిన సిఎం జగన్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడన మురళికి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. శ్రీనివాస్ నియామకంపై మండల జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, అక్కయ్యవలస సర్పంచ్ సుంకరి జనార్ధనరావు, లఖందిడ్డి సర్పంచ్ బమ్మిడి గణపతి, వైసిపి నాయకులు అక్కురాడ సురేష్, సింగూరు నారాయణరావు, కస్తూరిపాడు సర్పంచ్ గురివెళ్లి గోవింద్, దుప్పల శ్రీను అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

టెక్కలి రూరల్ : మండలంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధి ఆదిఆంధ్రవీధిలో మరమ్మతులకు గురైన హెచ్‌విసిబిని శుక్రవారం అమరుస్తున్నామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. అంజినపురం, మేఘవరం గ్రానైట్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హౌసింగ్ అధికారులకు ఘన సన్మానం

ఇచ్ఛాపురం: పట్టణంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత ఉత్సవాల్లో హౌసింగ్ అధికారులు నక్క గణపతి, టెక్కలి ఇఇ జోగారావు పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అధికారులకు దుశ్శాలువ కప్పి గురువారం సన్మానించారు. గ్రామ దేవత ఉత్సవాలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయాధికారి కమిటీ సభ్యులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ఇచ్ఛాపురం : మండలంలో తెలుకుంచిలోని ఇటీవల మృతి చెందిన చల్ల పుష్ప కుటుంబానికి వైఎస్ఆర్ బీమా నగదును సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి గురువారం అందజేశారు. ఇటీవల తెలుకుంచిలో చల్ల పుష్ప మృతి చెందారు. వారికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.పది వేలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచి మల్లేష్, బుగత రాము, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన కోట్ని వాసు ఇటీవల పక్షవాతంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడంతో ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణతర్ల హెల్పింగ్ వారియర్స్ రూ.17,100లు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సారవకోట చలపతిరావు, లోకనాథం, వేణుగోపాల్ పాల్గొన్నారు.





నాగమణి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజావక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జాతీయ రహదారి వాండ్రాడ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తులసిపేట కాలనీకి చెందిన కిర్రు నాగమణి (32), పెద్దబమ్మిడి చెందిన రాములమ్మ (59) మృతి చెందగా... నైరకు చెందిన కె.అశోక్, వెలమపేటకు చెందిన ఆటోడ్రైవర్ కె.చిన్నబుచ్చిబాబు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నిమ్మాడ పంచాయతీ రాజపురంలో జరిగిన ఓ వివాహానికి హజరై ఆటోలో తిరిగి వస్తున్నారు. వాండ్రాడ సమీపంలోకి వచ్చే సరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగమణి అక్కడికక్కడే మృతి చెందింది. రాములమ్మ కాలుకు, గుండెకు తీవ్రగాయాలు కాగా, అశోక్ కుమార్ కాలుకు, ఆటో డ్రైవర్ చిన్నబాబుకు నడుముకి, కన్ను వద్ద తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాములమ్మ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాగమణి మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతురాలు నాగమణికి భర్త విడాకులు ఇవ్వటంతో కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను పోషించేది. దీంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తల్లి మృతితో పిల్లలు అనాథులు మిగిలారని తులసిపేట కాలనీ వాసులు లబోదిబోమంటున్నారు. రాములమ్మ మృతితో పెద్దదూగాంలో విషాద ఛాయలు అలముకుంది.

గాయపడిన యువకుడు దుర్మరణం



ఈశ్వరరావు మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన పోలాకి ఈశ్వరరావు అలియాస్ సంజీవ్‌రావు (25) గాయపడిన వ్యక్తి గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 4న జాడుపల్లిలోని ఓ వివాహానికి శేఖర్‌తో కలిసి వివాహానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా... ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు తీవ్రంగా గాయపడగా, శేఖర్ స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాసత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి రాగోలు జేమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఈశ్వరరావు మృతి చెందారు. మృతుడికి తల్లిదండ్రులు, చెల్లెలు ఉన్నారు. దీంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

శ్రీనివాస ఫంక్షన్ హాల్ ప్రారంభం

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని కొర్లకోట రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీనివాస ఫంక్షన్ హాల్‌ను స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ... పేడాడ చిరంజీవిని అభినందించారు. అలాగే ఎసి హాల్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రారంభించారు. పది మందికి ఉపాధి కల్పించాలన్న ఆలోచన రావడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యవర్గ కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, పేడాడ శ్రీనివాసరావు, గొండు రవి పాల్గొన్నారు.

క్రీడా వికాస కేంద్రం పరిశీలన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు గురువారం పరిశీలించారు. క్రీడా మైదానంలో జరుగుతున్న క్రీడలు, వేసవి శిబిరం గురించి నిర్వాహకులు నర్సిపురం శేఖర్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, అథ్లెటిక్స్ క్రీడలు, తైక్వాండ్ శిక్షణలు ఇస్తున్నారు. అనంతరం మాట్లాడుతూ వేసవి శిబిరం నిర్వహణలో ఎటువంటు అసౌకర్యం కలుగకుండా చూడాలని శేఖర్‌ని సూచించారు. ఈయనతో పాటు కోచ్‌లు బాడాన నారాయణరావు, రమణ, కుప్పిలి ప్రకాష్, ఆర్ఐ.రామారావు పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి ఉంటే ఉత్తమ ఫలితాలు

పోలాకి: ఏ విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగి ఉంటారో వారే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రగతి చూపి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది తమ పాఠశాల్లో గొలివి ప్రేమ సఖి 584, కంచు స్పందన 578, శిమ్మ స్వాతి 577, కైబాడ రోహిత్ 577, జి.జాహ్నవి, పల్లి. శరణ్య 569 వచ్చాయని తెలిపారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రవీణ